చొప్పదండిలో రాస్తారోకో చేస్తున్న రైతులు

హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

మల్లాపూర్, ఏప్రిల్, 8: జగిత్యాల జిల్లా మల్లాపూర్ పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అశోక్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం మల్టీ జోన్ ఐజీ రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 17న మల్లాపూర్ పోలీస్‌స్టేషన్‌లోని కానిస్టేబుల్ ధనుంజయ్, సురేష్, హెడ్ కానిస్టేబుల్ అశోక్ అనే ముగ్గురు మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసుస్టేషన్ కార్యాలయం పైన మందు పార్టీ చేసుకున్నారు. పోలీసు సిబ్బంది తమ విధులను మరిచి రాజకీయ నాయకులతో కలిసి దావత్ చేసుకున్న ఘటనపై ఉన్నతాధికారులకు తెలయడంతో విచారణ చేపట్టి ధనుంజయ్, సురేష్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే, హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌పై శాఖాపరమైన చర్యల నిమిత్తం మల్టీ జోన్-1 ఐజీకి నివేదికను అధికారులు పంపారు. నివేదిక ఆధారంగా హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌ను సోమవారం సస్పెండ్ చేసినట్లు మల్టీ జోన్ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

నర్మాల గురుకుల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

గంభీరావుపేట, ఎప్రిల్ 8: గంభీరావుపేట మండలం నర్మాల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మలను అధికారులు సస్పెండ్ చేశారు. గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి ఆదేశాల మేరకు ఆర్‌సీవో మేరి యేసుపాదం నర్మాల ప్రిన్సిపాల్ నిర్మలను సస్పెండ్ చేస్తు ఉత్తర్వులు జారీ చేశారు. నర్మాల గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని యశస్వినిపై తల్లిదండ్రుల ముందే ప్రిన్సిపాల్ చేయిచేసుకున్న సంఘటన చర్చనీయాంశం కావడంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఈ విషయమై డీసీవో జాక్వెలిన్‌ను వివరణగా అడగా, నర్మాల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను శాఖాపరమైన చర్యల్లో భాగంగా సస్పెన్షన్ చేసినట్టు వెల్లడించారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈ నెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోన్ని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషి చేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్‌ఐ స్వామి పాల్గొన్నారు.

పీజీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 8: ఎస్ఆర్ఆర్ కళాశాల అటానమస్ పీజీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం ప్రిన్సిపాల్ రామకృష్ణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డిలు విడుదల చేశారు. శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల 2022-23 విద్యా సంవత్సరం నుంచి యూజీసీ అటానమస్ హోదా పొందింది. కళాశాలలో పీజీ 1,3వ సెమిస్టర్ల పరీక్షలు మార్చిలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కె సురేందర్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు డా.ఇ. కొమురయ్య, పురుషోత్తం, అకాడమిక్ కోఆర్డినేటర్లు డా. ప్రమోద్ కుమార్ డా. మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంలో ఎన్ఎస్‌యూఐ కీలక పాత్ర

● ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 8: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో ఎన్ఎస్‌యూఐ కీలక పాత్ర పోషించిందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా విస్తృతస్థాయి సమావేశం సోమవారం డీసీసీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా బల్మూరి వెంకట్ మాట్లాడుతూ ఎన్ఎస్‌యూఐ పక్షాన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకే తనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారన్నారు. కేంద్రంలో రాహుల్‌గాంధీ ప్రధాని కావాలని మరోసారి పట్టుదలతో పనిచేసేందుకు ఎన్ఎస్‌యూఐ నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి హైదరాబాద్‌లో వర్షాలు పడ్డప్పుడు బండి కొట్టుకుపోతే బండి ఇస్తామని హామీలిచ్చి మోసం చేశారని, అటువంటి నాయకుడిని ఓడించాల్సిన సమయం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు మతం పేరు మీద రాజకీయం చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయానికి, కొండగట్టు, వేములవాడ ఆలయాలకు ఎన్ని నిధులు తెచ్చారో బండి సంజయ్ చెప్పాలని బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్

దోపిడీ కుట్ర కేసులో 29 ఏళ్లకు నిందితుడి అరెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మారణాయుధాలతో భారీ దోపిడీకి కుట్ర చేసిన కేసులో 29 ఏళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని సీఐడీ పోలీస్‌లు అరెస్ట్ చేశారు. కరీంనగర్ జిల్లా జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో 1995లో నమోదైన దోపిడీ కుట్ర కేసులో నర్ర చందు అలియాస్ చంద్రయ్య ఏ-27గా ఉన్నాడు. కేసు నమోదు అయినప్పటి నుంచి చందు పరారీలో ఉన్నాడు. కేసు తీవ్రత నేపథ్యంలో జగిత్యాల రూరల్ పోలీస్‌ల నుంచి సీఐడీకి బదిలీ అయింది. అజ్ఞాతంలోఉన్న చందుపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో సీఐడీ పోలీస్‌లు గాలింపు మొదలు పెట్టారు. సీఐడీ చీఫ్ శిఖాగోయల్ ఆదేశాల మేరకు ఎన్‌బీడబ్ల్యూ స్పెషల్ ఎగ్జిక్యూషన్ బృందం నిందితుడు చందు నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఉన్నట్లు గుర్తించింది. పక్కా సమాచారంతో ఆదివారం రాత్రి చందును అరెస్ట్ చేశారు. నిందితుడ్ని కోర్టులో హాజరుపరిచి జుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీఐడీ అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ మృతి



రవీందర్(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, ఏప్రిల్ 8:మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్కతుర్తి మండలం పెంచికల్‌పేట గ్రామంలో ఆర్ఎంపీ వైద్యుడిగా పనిచేస్తున్న ఇప్పలపల్లి రవీందర్(42) జమ్మికుంటకు పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి వస్తున్నాడు. శాలపల్లి-ఇందిరానగర్ గ్రామ శివారులో హుజూరాబాద్-జమ్మికుంట ప్రధాన రహదారిపై యూటర్న్ వద్ద ఒక్కసారిగా వాహనం రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇప్పలపల్లి రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రుడిని జమ్మికుంటకు తరలించారు.మృతుడికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి మొగిళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 8: జమ్మికుంట మండలం గండ్రపల్లి గ్రామానికి చెందిన పార్వతి సాగర్ (23) అనే యువకుడు పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. మూడు సంవత్సరాల క్రితం సాగర్ వ్యాపారం చేసుకునేందుకు తండ్రి రాజయ్యను డబ్బులు అడిగాడు. ఇవ్వక పోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స అనంతరం కోలుకున్నాక కిరాణం షాపు పెట్టాడు. షాపు నడువక పోవడంతో అప్పుల పాలయ్యాడు. ఈ నెల 1న పొలం వద్దకు వెళ్లి పని చేసుకుందామని తండ్రి తన కుమారుడికి చెప్పాడు. సాగర్ పొలం పనులకు వెళ్లకపోవడంతో ఎందుకు పొలం వద్దకు రాలేదని తండ్రి మందలించాడు. దీనికి తోడు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. వరంగల్ ఎంజీఎమ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గంభీరావుపేట, ఎప్రిల్ 8: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్, ఆర్ఆర్‌నగర్ కాలనీ మధ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ అనిల్‌కుమార్ అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అనిల్‌కుమార్ మూడు రోజుల క్రిందట ద్విచక్ర వాహనంపై కామారెడ్డి వైపు వస్తుండగా, ఆర్ఆర్‌నగర్ కాలనీ వద్ద వాహనం అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. దీంతో ముందుగా ఎల్లారెడ్డిపేట అక్కడి నుంచి కరీంనగర్‌కు మెరుగైన చికిత్స కోసం తరళించారు. పరిస్థితి మరింత విషమించడంతో హైదరాబాద్‌కు తరళించగా చికిత్స పొందుతూ అనిల్‌కుమార్ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంమోహన్ తెలిపారు.

వరకట్న హత్య కేసులో భర్త, అత్తకు జీవిత ఖైదు

కోల్‌సిటీ, ఏప్రిల్ 8: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను అదనపు కట్నం కోసం వేధించి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో నేరం రుజువు కావడంతో దోషులు బిస్స రాజు, బిస్స దుర్గమ్మకు గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాసరావు జీవిత ఖైదు విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కేసు వివరాలు... గోదావరిఖని ఎల్‌బీ నగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడి కుమార్తె బీనవేని గౌతమి హనుమాన్ నగర్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి బిస్స రాజు మార్చి 14, 2009లో ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. గౌతమి తండ్రి సింగరేణి పదవీవిరమణ చేయడంతో వచ్చిన డబ్బుల నుంచి రూ.10లక్షలు కట్నం తేవాలంటూ గౌతమిని భర్త రాజు, అతని తల్లి బిస్స దుర్గమ్మ వేధించే వారు. ఇదే క్రమంలో ఆగస్టు9, 2014న గౌతమిని భర్త రాజు, అత్త దుర్గమ్మ గొంతు నులిమి హత్య చేశారు. తరువాత ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు మృతదేహంపై కిరోసిన్ పోసి నిప్పటించారు. అప్పట్లో ఈ ఘటన సంచలనం సృష్టించింది. మృతురాలి తండ్రి ఐలయ్య ఫిర్యాదు మేరకు అప్పటి వన్‌టౌన్ సీఐ శ్రీధర్ కేసు నమోదు చేశారు. అప్పటి ఏసీపీ ఫకీరప్ప చార్జిషీట్ దాఖలు చేశారు. మృతదేహం సమీపంలో చున్ని కాలకపోవడంతో అనుమానం వచ్చిన పోలీసులు తీగ లాగడంతో హత్య ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రస్తుత వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్, సీఎంఎస్ ఇన్‌చార్జి కొత్తకొండ శంకర్ ప్రాసిక్యూషన్ పక్షాన 28మంది సాక్షులను ప్రవేశపెట్టారు. అదనపు పీపీ జ్యోతిరెడ్డి సాక్ష్యాలు నిరూపించడంతో విచారణ జరిపి న్యాయస్థానం దోషులకు జీవిత ఖైదు విధించారు.

అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రంపై

ఫుడ్‌సేఫ్టీ అధికారుల దాడి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్ హస్నాపురి కాలనీ ప్రాంతంలోని ఒక ఇంటిలో ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రొడక్ట్ పేరిట అల్లం, వెల్లుల్లి తయారు చేస్తున్న కేంద్రంలో తనిఖీలు నిర్వహించి, సంస్థ యజమాని శ్రీనివాస్‌కు నోటీసులు జారీ చేశామని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్‌పీ శ్రీనివాస్, ఫుడ్ సేఫ్టీ అధికారి సుజాతలు తెలిపారు. శుభ్రత పాటించటం లేదని, నాణ్యత లేదనే ఫిర్యాదులతో ఫుడ్ ప్రొడక్ట్ సంస్థలపై వరుసగా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా సోమవారం ఎస్‌వీఆర్ ఫుడ్ ప్రొడక్ట్‌లో తనిఖీలు నిర్వహించమాన్నారు. తనిఖీల అనంతరం శాంపిళ్ల సేకరించి హైదరాబాద్ నాచారంలోని ఫుడ్ సేఫ్టీ లాబ్‌కు పంపించామన్నారు. ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులు వచ్చిన తర్వాత దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత వెల్లడించారు. కేంద్రంలో నిబంధనల మేరకు శుభ్రత పాటించనందున యజమానికి నోటీసు జారీ చేశామని తెలిపారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8: కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌కు చెందిన రావుల మారయ్య ఇంటిలో ఈనెల 4న చొరబడి నగదు, వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లిన నిందితుడు తోట మహేష్‌ను సోమవారం అరెస్టు చేసి లక్ష రూపాయల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. కట్టరాంపూర్ ప్రాంతంలోనే నివాసం ఉంటున్న మహేష్ అదే ప్రాంతంలో మారయ్య అనే వ్యక్తి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోన్ని లక్ష రూపాయల నగదు, ఒక లెనోవో లాప్ టాప్‌తో పాటు వెండి పట్టీలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరిపిన పోలీసులు నిందితుడు తోట మహేష్‌ను నేరస్థుడిగా గుర్తించి సొత్తును స్వాధీన పరచుకున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచి, జడ్జి ఆదేశాలతో రిమాండుకు తరలించామని పేర్కొన్నారు. దొంగతనానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడంలో కృషిచేసిన సిబ్బందిని ఏసీపీ నరేందర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐ సరిలాల్, ఎస్‌ఐ స్వామి పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరి అరెస్ట్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 8 : ఒక ప్రయాణికుడిని నగర శివారు ప్రాంతానికి తీసుకువెళ్లి కొట్టి దోపిడీకి పాల్పడిన కేసులో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా మేడిపల్లి గ్రామానికి చెందిన షేక్ షబ్బీర్ గత నెల 30న కరీంనగర్‌కు వచ్చి తన పని ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణంలో కోతిరాంపూర్ నుంచి బస్టాండ్ వెళ్లుటకు ఆటోలో ఎక్కాడు. ఆటోలో డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి కలిసి షేక్ షబ్బీర్‌ను సిరిసిల్ల బైపాస్ వైపుగా తీసుకెళ్లి కొట్టి మొబైల్ ఫోన్‌తో పాటు బ్యాగ్‌ను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటో ఠాణా పోలీసులు విచారణ చేపట్టారు. విచారణలో సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం గండిపెల్లి గ్రామానికి చెందిన, ప్రస్తుతం భగత్‌నగర్‌లో నివాసం ఉంటున్న నూనావత్ తిరుపతి, బానోత్ రాజులు నిందితులుగా పోలీసులు గుర్తించారు. షబ్బీర్ నుంచి 13 వేల రూపాయల విలువ సెల్ ఫోన్‌తో పాటు బ్యాగ్, అందులోని బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం కార్డు కార్డులు దోపిడీ చేశారు. బాధితుడి మొబైల్ ఫోన్‌లోని సిమ్ కార్డును నిందితుల మొబైల్ ఫోన్‌లోకి మార్చి బ్యాంకు అకౌంట్ ద్వారా 99 వేల రూపాయలను సైతం అపహరించారని విచారణలో వెల్లడైంది. నిందితులిద్దరు టవర్ సర్కిల్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకున్నామని ఏసీపీ తెలిపారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండుకు తరలించామన్నారు.

వ్యాపారులు సహకరించాలి

కోరుట్ల, ఏప్రిల్ 8: మార్కెట్‌లలో నిర్వహించే తైబజార్ నిర్వహణకు కూరగాయ మార్కెట్‌లోని వ్యాపారులు, రైతులు సహకారం అందించాలని మున్సిపల్ కమిషనర్ తిరుపతి అన్నారు. సోమవారం పట్టణంలోని గడిగుర్తు ప్రాంతంలోని కూరగాయ మార్కెట్‌ను సిబ్బందితో కలిసి పరిశీలించారు. మార్కెట్‌లో ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం తైబజార్ నిర్వహణను సహకారం అందించాలన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

కోరుట్ల: తాగు నీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ తిరుపతి తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ భవనంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, డైరెక్టర్, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ల ఆదేశాల మేరకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి సమస్య పరి ష్కారంపై దృష్టి సారించినట్లు కమిషనర్ తెలిపారు. నీటి సమస్యలు ఎదుర్కొంటున్న వారు టోల్ ఫ్రీ నంబర్ 180 042 54346, హెల్ప్ లైన్ నంబర్ 087225-299961లకు ఫోన్ చేయాలని సూచించారు. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ప్రజలకు తాగునీటి సరఫరాలో ఏమైన ఇబ్బందులు ఉంటే వెంటనే ఈ నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. మున్సిపల్ అధికారులు సమస్యలు పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

మెట్‌పల్లిలోనే అత్యధికంగా కళాకారులు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి, ఏప్రిల్, 8: తెలంగాణలో అత్యధికంగా కళాకారులు ఉన్న ప్రాంతం జిల్లాలోని మెట్‌పల్లి ప్రాంతమేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. మెట్‌పల్లి లలిత కళా సమితి వారి ఆధ్వర్యంలో ఉగాది రంగస్థల నృత్య కేళి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి పట్టణంలోని ఎస్సారెస్పీ గార్డెన్‌లో నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీనియర్ కళాకారులు తిరుకోవెల లక్ష్మణస్వామి, సినీ నటుడు గోదురు మురళి లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లలితా కళా సమితి అధ్యక్షుడు మట్టె ల గంగాధర్, నవీన్‌కుమార్, కోటగిరి వెంకటస్వామి, కోటగిరి చైతన్య, మర్రి భాస్కర్, చొప్పరి శ్రీనివాస్, భూపతిగౌడ్, మారుతి, సంజీవ్, మధు, నరేష్, సూర్య శ్రీకాంత్, శేఖర్, శివానందం, అపర్ణ, నాయకులు, కళాకారులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించాలి

జగిత్యాల, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వైభవంగా చిన్న హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అధికారులకు సూచించారు. పట్టణంలోని ఐడీఓసీ సమావేశం మందిరంలో చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు సలహాలను అందించారు. ఈ నెల 22 నుంచి 24 వరకు కొండగట్టు హనుమాన్ దేవాలయంలో చిన్న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏడు స్థలాల్లో పార్కింగ్ ఏర్పాటు చేశామని ఆ ప్రాంతాలలో తాగు నీరు సౌకర్యంతో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. భక్తుల సౌకర్యార్థం పులిహోర, లడ్డూ ప్రసాదం కోసం 14 కౌంటర్లు, కేశ ఖండన ప్రత్యేక దర్శనం టికెట్ల కోసం 12 కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కౌంటర్ల వద్ద 3 షిఫ్టులుగా సిబ్బందిని కేటాయించి విధులు నిర్వ హించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నూతన కోనేరులోని నీటిని ఎప్పుడికప్పుడు పంపిణీ చేసి శుభ్ర పరచాలని, 120 షవర్ బాత్‌లు మహిళలు పురుషులకు ప్రత్యేకంగా డ్రెసింగ్ రూంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేశ ఖండనం చేసుకునేందుకు వీలుగా 1500 మంది నాయిబ్రాహ్మణులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీక్ష సాముల కూర్చుకునేం దుకు ప్రత్యేక చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం, రోడ్లు, ధర్మశాలలు, దేవాలయ పరిసర ప్రాంతాలలో ఎప్పుడికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. 76 శాశ్వత మరుగుదొడ్లు, 58 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లను చేస్తున్నట్లు తెలిపారు. 28 చలివేంద్ర కేంద్రాలను ఏర్పా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

టు చేస్తున్నట్లు వివరించారు. రాత్రి వేలలో కాలి నడకన వచ్చే భక్తుల కోసం రేడియం స్టిక్కర్లను అందించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దేవాలయ ఆవరణలో 64 సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందని ప్రత్యేక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దేవాలయ అవసరాల నిమిత్తం నీటి వసతి కల్పించాలని మిషన్ భగీరథ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉన్నందున నియమావళి ప్రకారం అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర్, అదనపు ఎస్పీ వినోద్ కుమార్, డీఎస్పీ రఘు చందర్, కొండగట్టు ఆలయ ఈవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణపై దృష్టి సారించాలి

కథలాపూర్, ఏప్రిల్ 8: గ్రామాల్లో రాబోవు మూడు మాసాల్లో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా అటవీ అధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని అంబారి పేట, కలికోట గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితులను పరిశీలించారు. పగిలిన పైపులు మరమ్మతులు వేగవంతం చేయాలన్నారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్, ఎంపీఓ ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

రంజాన్ పండుగ కోసం ఈద్గా వద్ద ఏర్పాట్లు

మెట్‌పల్లి, ఏప్రిల్, 8: రంజాన్ పండుగ కోసం ఈద్గా వద్ద మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం వెంకట్రావుపేట శివారులోని ఈద్గా ప్రాంతాన్ని మున్సిపల్ కమిషనర్ మోహన్ పారిశుధ్య కార్మికుల చేత శుభ్రం చేయించారు. ఈద్గా మైదానం, పరిసరాల్లో పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు తాగు నీరు ఏర్పాటు చేసి ముస్లింలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జగిత్యాల టౌన్ : రంజాన్ పండుగకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు మసీదులు, ఈద్గాల వద్ద రంజాన్ పండుగను పురస్కరించుకుని చేపడుతున్న సౌకర్యాలను సోమవారం పరిశీలించారు.

కోరుట్ల : పట్టణ శివారులోని జాతీయ రహదారిపై సోమవారం ఉదయం బీహార్‌కు చెందిన షాబీర్ కళీషా (59) అనే డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు.

వెల్గటూర్: చిన్న పిల్లలకు పౌష్టికాహారం అందించాలని తద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపం తలెత్తదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అండాళు పేర్కొన్నారు. మండలంలోని రాజక్కపల్లి అంగన్‌వాడి కేంద్రంలో బాల్య సంరక్షణ, విద్య (ఈసీసీఈ) కార్యక్రమం నిర్వహించారు.

మల్యాల: జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంచందర్ సోమవారం కొండగట్టు అంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

పెగడపల్లి : మండలంలోని బతికెపల్లితో పాటు పలు గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం చిన్నారులచే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ మహేశ్వరి పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని సంద్రల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మండలంలోని తిర్మాలాపూర్, పోతారం గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ చిన్నారులతో గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. సంద్రల్లపల్లి పాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏనుగు ఆదిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: అనుమతులు లేకుండా రైతులకు ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని జగిత్యాల జిల్లా వ్యవసాయాధికారి వాణి అన్నారు. సోమవారం జగిత్యాల రూరల్ మండలంలోని కల్లెడ రైతువేదికలో సారంగాపూర్, జగిత్యాల రూరల్ మండల ఇన్‌పుట్ డీలర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు.

పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలు

మెట్‌పల్లి, ఏప్రిల్ 8 : పట్టణంలోని పలు విద్యాసంస్థలు, కళాశాలలో ముందస్తుగా ఉగాది వేడుకలను నిర్వహించారు. సోమవారం పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ కళాశాల వారి ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలోని శ్రీ వాణి విద్యాలయంలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు, ఫుడ్ ఫెస్టివల్, పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పండితులు పాలెపు సందీప్‌కుమార్ ఉగాది పంచాంగ శ్రవణం విశిష్టత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ గట్ల శ్రీనివాస్, డైరెక్టర్స్ సంగనభట్ల దినేష్, సంగనభట్ల సంతోషి, శంకర్, ఉపాధ్యాయులు, పోషకులు పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి, వివేకవర్ధిని పాఠశాలల్లో ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడిని విద్యార్థినీ, విద్యార్థులు తాగి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మన తెలుగు సంవత్సరాది అయిన ఉగాది విశిష్టత గురించి పిల్లలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్, డైరెక్టర్‌లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు రంజిత్, మహేష్, హరీష్, సంజన, రష్మిత పాల్గొన్నారు.

●మండలంలోని అల్లీపూర్, ఇటిక్యాల శాఖల ఆధ్వర్యంలో



మెట్‌పల్లిలో ఉగాది వేడుకలు జరుపుతున్న విద్యార్థులు

సోమవారం ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రార్థన అనంతరం ఆరు రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ వికాస్ ప్రముఖ్ తోపారపు రవీందర్, ఖండ కార్యవాహ వేల్పుల స్వామి యాదవ్, ఖండ బౌద్ధిక్ ప్రముఖ్ దొంగ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలె శేఖర్, ప్రధానోపాధ్యాయురాలు బాలె జయశ్రీ, అకాడమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డు వద్ద గల లాస్య ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుక



రాయికల్‌లో ఉగాది పచ్చడి తీసుకుంటున్న విశ్వశాంతి విద్యార్థులు

లు నిర్వహించారు. ఉగాది ప్రాశస్త్యాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఉగాది పచ్చడి తదితర తయారీ చేశారు. కరస్పాండెంట్ సాయిరాం రాజు, హెచ్‌ఎం సుస్మ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

కొడిమ్యాల: మండలంలోని సంద్రల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలను ఘనంగా పాఠశాల ప్రధానోపాధ్యాయడు ఏనుగు ఆదిరెడ్డి ఘనంగా నిర్వహించారు నిర్వహించారు.

సరస్వతి దేవి చిత్ర పటానికి పూల మాల వేసి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు స్వర్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పుడు తూకంతో మోసం

ఎండపల్లి, ఏప్రిల్ 8: మక్కల కొనుగోళ్లలో తప్పుడు తూకంతో రైతులను మోసం చేసిన ఘటన మండలంలోని కొండాపూర్ గ్రామంలో జరిగింది. రైతులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి దళారి కొండాపూర్ గ్రామంలోని రైతుల వద్ద నుంచి మక్కలు కొనుగోలు చేస్తున్నాడు. అయితే 60 కిలోల 500 తూకం వేయాల్సింది రైతులకు ఏర్పడకుండా అదనంగా రెండు కిలోలు తూకం వేస్తున్నాడు. రైతులకు అనుమానం రావడంతో గ్రామంలోని ఎలక్ట్రానిక్ కాంటాతో తూకం వేయడంతో అదనంగా రెండు కిలోలు తూకం వేస్తున్నట్లు బయటపడింది. దీంతో సదరు దళారిని రైతులు నిలదీశారు. రైతులు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఉమా సాగర్ తెలిపారు.

రాజారంలో ట్రాక్టర్ దొంగతనం

మల్యాల, ఏప్రిల్ 8: మండలంలోని రాజారంకు చెందిన గడ్డం చంద్రశేఖర్ ట్రాక్టర్ చోరీకి గురైయింది. ఆదివారం సాయంత్రం తన ఇంటి వద్ద ట్రాక్టర్ పార్కు చేయగా సోమవారం ఉదయం కనిపించలేదు. దీంతో చంద్రశేఖర్ పోలీసులకు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మల్యాల సీఐ నీలం రవి తెలిపారు. ట్రాక్టర్ కనిపించిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

'ఎన్నికల నిర్వహణకు పోలీసులకు సహకరించాలి'

కొడిమ్యాల, ఏప్రిల్ 8 : ఎన్నికల నిర్వహణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అడిషనల్ ఎస్పీ బీంరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని మేన్ రోడ్డుపై జిల్లా పోలీస్, కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ కవాతును నిర్వహించారు. అంతకముందు అడిషనల్ ఎస్పీ జెండా ఊపి కవాతును ప్రారంభించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ లోక సభ ఎన్నికలలో ప్రజలు ఎలాంటి భయ భ్రాంతులకు గురి కాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది నిష్పక్షపాతగా విధులను నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల, మల్యాల ఎస్సైలు సందీప్, రామక్రిష్ణ, ఆర్ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి కవాతు ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ

అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే చర్యలు

మెట్‌పల్లి, ఏప్రిల్, 8 : అనుమతులు లేకుండా మట్టి, ఇసుక రవాణ చేసిన, నిల్వ చేసిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై చిరంజీవి హెచ్చరించారు. సోమ వారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లు, మూడు మట్టి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థుల వీడ్కోలు హంగామా

ధర్మపురి, ఏప్రిల్ 8: ధర్మపురి మండలంలోని దొంతాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈవో బత్తుల భూమయ్య హాజరయ్యారు. హెచ్‌ఎం భట్టారి రాజేశం, టీచర్లు సునీత, సతీష్, సింధూజ, అనిత, సీఆర్‌పీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వసూళ్లు చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మల్యాల, ఏప్రిల్ 8: ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తుల నుంచి అటవీ అధికారుల పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడిన వ్యవహారాన్ని ఆ శాఖ ఉన్నత అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. వసూళ్లకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం 'అటవీ అధికారుల పేరిట వసూళ్లు' అనే శీర్షికన కథనం రావడంతో అటవీ అధికారులు కదిలారు. ఓ అధికారి వద్ద డ్రైవర్‌గా పని చేస్తున్న వ్యక్తి ఇసుక రవాణా చేస్తున్న పలువురు ట్రాక్టర్ యజమానుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నరని బాధితులు పేర్కొనగా విచారణ జరిపి నివేదిక పంపించాలని అటవీ అధికారులు ఇక్కడి అధికారులను ఆదేశించారు. దీంతో కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ అధికారి బి.లత, ఓగులాపూర్ ఎఫ్ ఎస్‌వో రత్నమ్మ డబ్బులు వసూలు చేసిన యువకుడు ప్రశాంత్‌ను విచారించారు. అటవీ అధి కారుల పేరు చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మల్యాల పోలీస్‌స్టేషన్‌కు ఎఫ్‌ఆర్‌వో, ఎఫ్‌ఎస్‌వో రా గ డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై ఎఫ్‌ఎస్‌వో పిర్యాదు చేశారు. వసూలు చేసిన సొమ్ములను సదరు వ్యక్తి తిరిగి తమకు వాపస్ ఇచ్చిన్నట్లు కొందరు ట్రాక్టర్ యజమానులు తెలిపారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

రాయికల్, ఏప్రిల్ 8: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం కుష వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని ఎటువంటి మచ్చలు ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రాయికల్ మండలంలో సర్వే ద్వారా గుర్తించిన 85 మంది కుష్టు వ్యాధి అనుమానితులను స్క్రీనింగ్ చేశారు. డీపీఎంవో హీర్యా నాయక్, సీహెచ్‌వో ప్రమీల, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, ఎల్‌టీ సంతోష్, డీఈవో పవన్ పాల్గొన్నారు.

'రైతుల గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేకు లేదు'

మల్లాపూర్, ఏప్రిల్, 8 : రైతుల గురించి మాట్లాడే అర్హత కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించ కపోతే తాను గేటు వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంటానని చెప్పినందుకు నీ తండ్రిని ఎమ్మెల్యేగా రైతులు గెలిపించారన్నారు. కానీ నేటికి ఫ్యాక్టరీ తెరిపించలేదని దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. టీఆర్ఎస్, బీజేపీలు కలిసి మూసివేసిన కర్మాగారాన్ని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం తెరిపిస్తామన్నారు. మండలంలోని మొగిలిపేట గ్రామంలో కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లాల జలపతిరెడ్డిని నాయకులు సన్మానించారు. ఎన్నికకు సహకరించిన జువ్వాడి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పుంద్ర శ్రీనివాస్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, అబ్బూరి నాగరాజు, బండారి రమేష్, నూతిపెల్లి రాజం, ఎర్ర భూమయ్య, కోటగిరి ఆనంద్, జెట్టి లింగం, పాల్గొన్నారు.